కలికి - చిలుక

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

"కలికీ! నాలుగుదినములనుండి నీచెలికారము నన్నెంతసంతోషపెట్టుచున్నదో చెప్పుటకు నాకు చేతగాకున్నది. ఆహా! భవభూతికవి ఉత్తరరామచరిత్రలో 'అద్వైతం సుఖదుఃఖయోః' అని ఆరంభించి దాంపత్యమునుగురించి ఎంతమంచిపద్యము చెప్పినాడనుకొన్నావు! ఏదీ! నీవు సంస్కృతము నేర్చుకొన్నావైతివిగదా! మీనాయనగారికి అప్పుడప్పుడు ఉత్తరాలలో వ్రాస్తూవచ్చినాను. "మీకుమార్తైకు సంస్కృతము నేర్పించండి" అని, అట్లాయేమీ జరుగలేదుగదా! అబ్బ! ఆయనమాటే ఆయనమాట ఆయన నింకొకరుచెప్పి ఒప్పించడము కష్టసాధ్యము. ఇంతవరకు వారియిష్టము. అయినది అయినది గాని, యికనైనా నా దగ్గరకు వచ్చినతర్వాత సంస్కృతము నేర్చుకోవలెసుమా! నేర్పుతాను; ఏమయినది చెప్పవు నీ ప్రయాణముమాట యింతకూను? మీనాయనగారు, అమ్మగారు, ఏమనుకొంటున్నారు? ఇప్పుడు పంపిస్తారా? గట్టిగా కనుక్కోవద్దూ! ఎట్లా యిక మరి? నీవూ కనుక్కోలేకపోతివి; అంతకంటె నేను అసలే అడుగలేకపోతిని; పాడుసిగ్గు. నిన్నసాయంకాలము అట్లా వీధిలోకి వెళ్లినప్పుడు ఎట్లాగో మనసును గట్టిపరచుకొని మీఅన్నయ్యతో చెప్పినాను; కాని; ఆయన 'నాయనగారితో అనకపోయినావా, నాతో చెప్పితే ఏమి లాభము, నామాట వింటారా? అయినా చెప్పిచూస్తాను' అన్నాడు. అడిగితే ఆయన అడుగవలసినదే గాని నే నడుగలేను సుమా! నాకు అసలే మీనాయనగారిని చూస్తే తారు! ముఖము చాటుగా ఉన్నప్పుడు ఏదయినా ఉత్తరాలలో వ్రాస్తే వ్రాయగలను గాని ఎదట బడితే మెదలలేను. మీనాయనగారికి మీమీద వెఱ్ఱిప్రేమసుమా! మీమీద అంటే కూతుళ్లమీదనే, కొడుకులమీద అంతలేదు. కూతుళ్లను పంపించండి అని అడుగకుండా ఉంటే అల్లుళ్లమీదకూడా అంతప్రేమ ఉంటుందిగాని ఆమాట వస్తేమాత్రము బెదుస్తుంది. ఇక నాకు సెలవులేదు. అదీ కాక ఇంటిదగ్గర మాఅమ్మ ఒక్కత్తే ఉన్నది. రేపు వెళ్లక తప్పదు. నిన్ను విడిచి వెళ్లడానికి కాళ్లాడడము లేదు. ఎట్లాగయినా. తీసుకొని వెళ్లవలెనని ఉన్నది." అని శ్రీరామమూర్తి మధ్యాహ్నము భోజనమయినతర్వాత పడకగదిలో కూర్చుండి తాంబూల మియ్యవచ్చిన ప్రేయసియైన సీతతో ముచ్చటించెను.

ఎదట ఎవరూ లేకుండుటను చూచి సీత గదితలుపు ఓరవాకిలిగా వేసి కపటాకులను

చిలుకలుగా చుట్టి వ్రేళ్లకు పెట్టుకొని ఒక్కొక్కటిగా వల్లభునిపల్లుమొగ్గలకు అందిస్తూ ఈవిధముగా బదులు చెప్పెను. "నిన్న మీరిట్లా అడిగినారని మాఅన్నయ్య ప్రొద్దున నాన్నగారితో అన్నాడు."

శ్రీరామ:—ఏమిటీ! బావ అడిగినాడూ! మీనాన్నగారేమన్నారు? మీఅమ్మగారేమన్నది?

సీత:—నాన్నగారు కసురుకొన్నారు. 'ఇప్పుడేమిటోయి పంపించడము? అయినా నీ వడగడమేమిటి? నీకు బదులు చెప్పడమేమిటి, పోపొమ్మని;

శ్రీరామ:—మీ అమ్మగారేమన్నారు?

సీత:—మాఅమ్మ మీపక్షము మాటాడింది. "ఎందుకు అట్లాకసురుకొంటారు బావమరిదిచేత అడిగిస్తే తప్పువచ్చిందా యేమిటి? ఎట్లాగూ పంపక తప్పుతుందా? ఇంకా వారంరోజులలో చిన్నమ్మాయిపుట్టినదినము పండుగ వస్తున్నది. అది అయినతర్వాత పంపిస్తానని చెప్పండి" అన్నది. "కార్యమయి వడసారం ఆర్నెల్లు కాలేదు. ఎవడు చెప్పాడే! ఇప్పుడే పంపించమని! ఛట్! వల్లకాదు. ఆ మాట ఇప్పుడు ఎత్త రాదు. కొన్నాళ్లదాకా పంపించడానికివీలే లేదు. పసికూనను పంపిస్తుందట పదిరోజులైనతర్వాత!" అని నాన్నగారు మరింత గద్దించినారు గాని, మా అమ్మ నిమ్మళంగాతప్పించి ఎట్లాగోసర్ది మీతో ఈవిషయము చెప్పమని మాఅన్నయ్యతో చెప్పినది. పదిరోజులయినతర్వాత పంపిస్తానన్నది. కాని మానాన్నగారికి ఇష్టములేదు."

శ్రీరామమూర్తి ముఖము చిన్నబుచ్చుకున్నాడు. కటకట పడ్డాడు. ఏమి చెయ్యగలడు! ఆలోచించినాడు. తోచలేదు. 'సరే—ఇంటికివెళ్లి నేనూ, గట్టిగా ఉత్తరము వ్రాస్తాను. ఇంతకంటె ఏమి చేసేది.' అనుకొన్నాడు.

పంజరములో చిలుక కిలకిలలాడింది. మూన్నాళ్లనుండి దానిముచ్చటలతో కూడా కొంత వినోదము అతనికి కలుగుతూ ఉండేది. శ్రీరామమూర్తి కిప్పుడు సీతను వదలి వెళ్లడమే కాక చిలుకను వదలి వెళ్లడముకూడా దుస్సహామే అని తోచినది.

శ్రీరామ:—నీవియోగదుఃఖము నాకు దుస్సహాముగా ఉంటుంది. ఇంటికి వెళ్లిన తర్వాత కాలక్షేపము ఎట్లాగో నాకు తోచ లేదు. నీపలుకులకు బదులు చిలుకపలుకు

లయినా వింటూ ఉంటే కొంతఉబుసు పోకగా ఉంటుందేమో! దీనిని తీసుకు వెళ్లుదునా? దీనిని తీసుకువెళ్లడానికి మాఅత్తమామలపెత్తన మక్కర లేదుగద!

సీత:—మీసంతోషముకంటె నా కింక కావలసిన దేమున్నది? తప్పక తీసుకొని వెళ్లండి; కాని దానితో వినోదము కుదిరి నన్ను మరచిపోతారేమోనని దిగులుగా ఉన్నది. మళ్లీ ఎప్పుడు వస్తారు? ఎపుడు వస్తారో? నన్ను కూడా తీసుకువెళ్లుదురూ!

శ్రీరామ:—కన్నుల నీరు కమ్మగా— "ఏమి చెప్పేది. ఉత్తరము వ్రాస్తాను గదా? ఇప్పు డెట్లా తీసుకువెళ్లడము? నీ వేమయినా అడిగి ఏర్పాటుచేయగలిగితె సరే! నేను గట్టిగా పట్టుపట్టి అడగలేను."

అంతలో బావమఱది సావడిలో 'బావ ఎక్కడున్నా'డని విచారించడము విని శ్రీరామమూర్తి గదిలోనుండి బయటికి వచ్చెను.

శ్రీరామమూర్తి ఒక్కడే వెళ్లేటట్టు ఏర్పాటయినది. అల్లుడు బదు లాడక అంగీకరించి నందులకు మామగారు మహానందభరితులయినారు. కూతుర్ని పంపండి అని కోరినపుడు పుట్టినతలపులన్నీ యిపుడు తలక్రిందులయినవి. అంతకుముందు పదిపండ్రెండురూపాయలదోవతులచాపు కట్టబెట్టదలచుకొన్నవారు ఏబదిరూపాయలపట్టుత్తరీయము పట్టంచుధోవతి, కట్టనిచ్చినారు. రైలుచార్జిక్రింద పాతికరూపాయ లిచ్చినారు. ఊరినుండి పది మైళ్లు ఎద్దుబండిమీద వెళ్లి తర్వాత రైలెక్కవలెను. తెల్లవారుజామున ఏకారణము చేతనైనా బండివాడు పాలుమాలి బండి తోలుకొని రాకపోతే ప్రయాణము మొండిపడిపోతుందేమో, మళ్లీ కూతుర్ని పంపండని అల్లుడు అడిగిపోతాడేమో నని దిగులుచేత మామగారు సాయంకాలానికే బండి తెప్పించి వాకిటిముందర ఊడదీయించినారు. ఆబండిని జూచి, శ్రీరామమూర్తి, సీత, కంటతడిపెట్టుకో సాగించినారు. అవతల ఉద్యోగపు తొందర మొదలయిన చిక్కులు ఎట్లా ఉన్నా శ్రీరామమూర్తి అప్పుడు ఏదయినా కారణము ఏర్పడి ప్రయాణము నిలిచిపోతే ఔను అనుకొంటాడు.

ఊరుమిరపకాయలు, బుడమదోసకాయలు, మక్కజొన్నకండెలు, మొదలయిన తినుబండారములు మూటకట్టినారు. ప్రయాణము సర్వసిద్ధమయినది. రాత్రి శ్రీరామమూర్తికి, సీతకు, కలిగినవిచారము ఎట్టిదో ప్రాయపుదంపతులు కొంతయినా తెలుసుకోగలరు. తెల్లవారుజామున బండి సిద్ధపరిపించి మామగారు అల్లుని పిలిచినారు. నాలుగు పిలుపులు పిలిచినతర్వాత. నిద్ర మెలకువ నటిస్తూ కన్నులు నులుముకొంటూ ఉన్నట్టు కన్నీరు తుడుచుకుంటూ, శ్రీరామమూర్తి చిలకపంజరము చేత పుచ్చుకొని గదిలోనుండి బయటికి వచ్చినాడు.

గదిలోనుండి వచ్చేటందుకు ముందు ఆతడు, సీతచీర చెంగున ఏదో ముడివేసి తర్వాత చూచుకొమ్మని చెప్పెను. కార్యమునాడు కట్టినట్టు బంగారమేమో కట్టినారనుకొని సీత కన్నీరు కారుస్తూ 'మీదగ్గరే ఉంచు



కొంచెం, నా కిప్పుడు సామ్మెందుకు, వద్దు వద్దు.' అని చెప్పి విప్పబోయినదిగాని, 'అది కాదు, తర్వాత చూచుకోమ్మని శ్రీరామమూర్తి కన్నీరుతుడుస్తూ చెప్పలేక చెప్పలేక, చెప్పి మరీ బయటికి వచ్చినాడు. తెల్లవారవస్తున్నదని తొందరపరిచి ప్రయాణము చేయించి మామగారు ఊరిబయటిదాకా బండి సాగనంపి మరీ యింటికి వచ్చినారు.

ఆతర్వాత సీత ముడి ఊడదీసి చూచుకొన్నది. కాకితము ఉన్నది. అందులో ఈ క్రిందిపద్యా లున్నవి.

క. కలికీ! చిలుకలకొలికీ!
చెలువమ్ములు చిలికి తేర్చి చేర్చిన వెన్నా!
చెలి. మిన్నా! బలవంతపు
వలవంతకుఁ బాలుపడుతువా నను? సెలవా?

క. రిక్కలరాయనిచెలువపు
ధిక్కారమ! ముద్దుగుమ్మ! తేనియసోనల్
చిక్కడువాతెఱ చక్కని
చుక్కా! నిన్నెపుడు మరలఁ జూచెదనొక్కో!

౨

పూర్వదినము చిన్నకూతురు పుట్టిన దినముపండుగకు కట్టిన ఉయ్యాలతాళ్లను, ఊడదీస్తూ, సీతతండ్రి సావడిలో ఉండగా టపా బంట్రౌతు సుబ్బయ్య 'ఉత్తరాలు, ఉత్తరాలు' అని కేక వేసుకొంటూ వచ్చి ఉత్తర మిచ్చిపోయినాడు. బంట్రౌతు కేక విని వచ్చి సీత ఉత్తరము కేసి చూస్తూ తండ్రి ఊడదీసిన తాళ్లను చుట్టిపెట్ట మొదలు పెట్టింది. ఉత్తరము తెరచి సగము ముప్పాతిక పాలు చదివి ఆయన విసరిపుచ్చుకొని దూరముగా పారవేసి మొగాన గంటుపెట్టుకొన్నాడు. అంతలో ఆయనకుమారుడు వచ్చి ఉత్తరము ఎత్తి పుచ్చుకొని, తల్లిదగ్గిర చదువుటకు లోనికి తీసుకొనిపోయెను. అయిదారునిమిషాలయినతర్వాత ఆగ్రహవికారము అణచుకొని లోనికిపోయి భార్యాపుత్రులయెదుట ఈ క్రిందివిధమున ఆయన మాటాడెను.

"ఏమే! అల్లుడుగారు వ్రాసిన ఉత్తరము విన్నావా? చిలక బెంగపెట్టుకున్నదట! ఆహారము తినడము లేదట! అందుకని దానిని పెంచుతూ ఉన్న అమ్మాయిని వెంటనే పంపవలెనట! లేదా చిలుకను వెంటనే తీసుకొనివెళ్లనైనా వెళ్లవలెనట! నక్కజిత్తులు! ముఖము యెదుట నత్తురు నత్తురుమని ఊరుకుంటాడు! మొగము చాటుచేసుకుని ఉత్తరాలలో చూపిస్తాడు పాండిత్యము అంతాను. ఈ పదిరోజులలోనే యింత పన్నుగడ పన్నుతా

డనుకొంటే, అన్నిరూపాయలు కర్చుపెట్టి పట్టుబట్టలు అవీ కొనియిచ్చేవాణ్ణటే! అవీ కాజేశాడు. మళ్లీ ఆటా సాగించాడు. వీణ్ణి చిలక నెవ్వడు తీసుకువెళ్లమన్నాడు? ఈఎత్తు లెవ రెత్తమన్నాడు? నిజమే వ్రాయరాదూ? చిలకనెపమెందుకు? చిలకకథే నిజమయితే మరేమీ ఫరవాలేదులే! నాలుగురోజులు పోతే అదే అలవాటు పడుతుంది. ఇట్లాగనే బదులు వ్రాస్తాను. కన్నులలో మెదలుతూ ఉండే కన్నతల్లిని విడిచి నేనుండగలనా? నన్ను విడిచి మాఅమ్మాయి ఉండగలదా?" అని కన్నీరు తెచ్చుకొనెను!

కుమారుడు:—నాన్నా! మీ ర న్న మాట నిజమే! బావ అమ్మాయిని పంపండని బాహాటంగా వ్రాయలేక చిలకమీద నెపం పెట్టి ఉత్తరము వ్రాసినాడు. అతనిసిగ్గరితనమును గుర్తించి మీరు అమ్మాయిని పంపిస్తే బాగుంటుంది. నాలుగురోజులు పోతే బెంగ తీరి చిలక అలవాటుపడుతుందని మీరంటిరి గదా! అట్లాగే నాలుగురోజులు పోతే మీకూ బెంగతీరుతుంది. అలవాటవుతుంది. అమ్మాయికీ అంతే;

తండ్రి:— ఓరీ! నీవెక్కడపుట్టావురా నాకూ! ఏతి అంటే పైతి అంటావు!

అంతలో కోడలు వచ్చి మామగారు చూడకుండా భర్తకు ఏదో సూచించి పని మిషమీద ఆప్రక్కనే నిలుచుండెను.

కొడుకు:—కాదు నాన్నా! ఆర్నెల్లయినా అమ్మాయిని పంపడానికి అభ్యంతరము చెప్పడము బాగుండలేదు. కబుర్లమీద కబుర్లు కురిపించి నెలలోనే కోడలిని మనము తీసుకు వచ్చినామా లేదా? అది తలుచుకోవద్దా?

తండి:—ఓరిదుర్మార్గుడా! 'కోడల్ని వెంటనే ఎందుకు తీసుకురావడము? వద్దు. కొన్నాళ్లు పుట్టింటనే ఉండనిమ్మని అప్ప డనక పోయినావట్రా! నీ బులపాటాన్ని పట్టికాదూ నే నప్పుడు అన్నికబుర్లు పంపింది; తీసుక వచ్చిందీని! అది నాకిప్పుడు తంటా అయినదీ?

కొడుకు:—నాన్నా! అప్పుడు నాబులపాటాన్ని బట్టి మీరు తీసుకువచ్చినట్లే, ఇప్పుడు బావబులపాటాన్నిబట్టి పంపించండని కోరుతున్నాను.

తండ్రి:—ఛా! పో! పిల్లకాకి కేమి తెలుస్తుంది. నీముఖము! నీవు చెప్పేదేమిటి! నేను వినేదేమిటి!" అని తుటారించి భార్యనుచూచి.. ఏమిటే! ఏమంటావు? నీవుద్దేశ మేమిటి? మాటాడవు. నేను నిన్నడిగితే వీడేమో బదులు చెప్పవస్తాడు.

భార్య:— న న్నేమి చెప్పమంటారు! మీయిష్టము. నే నేదైనా చెప్పితే కొడుకుకు తగిలినచీవాట్లే నాకూ తగుల్తవి.. మీరు ఎదటివాళ్లను గురించి మాట్లాడేటప్పుడు మిమ్ము మరచిపోతారు. చచ్చి స్వర్గాన ఉన్నాడు మానాయన; అనేవాడు మిమ్మల్ని "నాయనా! నీకడుపునకూడా నాలుగుకాయలు కాస్తే నే గాని తెలియ"దని. ఆయన ఆశీర్వాచనము ఫలించినది. నన్ను కార్యమయినతర్వాత మూడునిద్రలు అయినతోడనే ఈడుచుకు వచ్చారు. జ్ఞాపకమున్నదా? నన్ను చిన్నప్పటి నుంచీ పెంచిన పెద్దముండ మానాయనమ్మ

మంచంమీద ఉండగా 'నాయనా! ముసలమ్మ స్థితి చూచుకుని పదిరోజులయినతర్వాత పంపిస్తా'నని మానాన్న చెప్పుతూ ఉంటే ససేమిరా అని పట్టుపట్టి తీసుకు వస్తిరి. మరచిపోయినారా యేమిటి? సరే! ఆకాలము ఆకథ వెళ్లిపోయింది. ఇప్పు డెందుకు! చిన్నవాళ్ల ప్రేమలు చిన్నవాళ్లమనస్సులు కొంత ఆలోచించుకోవద్దా! ఆచిన్నవాడు ఎదుట అడగలేక వెళ్లి ఉత్తరము వ్రాసినాడు. మీవంటివాడే అయితే అప్పుడే పట్టుపట్టేవాడు. నన్నడుగుతున్నారుగనక చెప్పుతున్నాను పంపడం మంచిది. అతడు కోరినప్పుడు మనం పంపితే మనం కోరినప్పుడు పంపడానికి అతనికీ బుద్ధి పుట్టుతుంది. ఎట్లాగూ వాళ్ల బిడ్డగాని మనబిడ్డగాదు గదా!"

తండ్రికి అల్లునిమీద ఆగ్రహాము, కూతురుమీద కూర్మి, చిడిముడిపడినవి. సీతను చేరబిలచి దగ్గరకూర్చుండబెట్టుకొని కన్నీరు నించుకొనెను. సీత ఒక్క మొగము పెట్టెను.

"నామాట కేమి గాని, పసికూన! ఎట్లా పంపేది. వెళ్లి ఉండగలదా! బిక్కముఖం పెట్టినది. ఏమయినా సరే ఇప్పుడు పంపను" అంటూ తండ్రి సీత నడిగెను—అమ్మా! నీ వేమంటావు?

సీత:—(పెదవులు అదరగా)ఇప్పు డేదో సాహసించి అనకపోతే చెడుతుందని లోన అనుకొని, "నాన్నా! చిలకేమయిపోతుందో!—" అంటూ యింకా ఏదో చెప్పనున్నదిగాని తండ్రి కిక చెవి కెక్కేటట్టు లేదయ్యెను. కోపము వచ్చినది. ప్రేమ పరిణామము మనస్సులో తట్టినది. చఱ్ఱుమని లేచినాడు. "సరే! రేపో యెల్లుండో మంచిరోజు చూచి ప్రయాణం చేసి దిగవిడిచి రండయ్యా తల్లీ కొడుకూను;" అంటూ కిఱ్ఱుచెప్పులు తొడుగుకొని కఱ్ఱచేతపుచ్చుకొని "పొలానికి పోతున్నా"నని భార్యతో చెప్పి బయటికి వెళ్లినాడు. మూడు రోజులు అయినతర్వాత అట్లే అంపించినారు.

గీ. ఉభయవంశలలామ మయ్యుత్పలాక్షి
యత్తవారింటి కరిగెడునవసరమున
మాతృజనకసఖీజనభ్రాతృవిరహ
మధిపతిప్రేమజలరాశి కౌర్వ మయ్యె.

శృంగారనైషధము.

3

సీత వచ్చి పదిరోజులే అయినదిగాని యింతలోనె చిక్కి సగమయినది. కడు గారాబముతో కన్నులలో కప్పుకొని పెంచిన తల్లిని తండ్రిని విడిచి వచ్చినదుఃఖ మాచిన్నదానికి దుస్సహాముగా ఉండెను. ఒంటరిపాటున పులుకుపులుకున ఏడ్చును. భర్త చేరవచ్చినపుడు కొంతసమ్మాళించుకొనునుగాని ఒక్కొక్కప్పుడు అక్కడకూడ కన్నీరు కార్చుచుండును. ఈవైక్లబ్యము చూచి భర్త తరుచుగా ఇట్లు బెదరించుచుండెను. "నీవు మిక్కిలి దుఃఖిస్తున్నావు. 'కడుపునిండ ఆహారముకూడా తినడము లే'దని మాఅమ్మ అంటున్నది. మీనాయనగారికి వ్రాస్తాను. వచ్చి తీసుకువెళ్లవలసినదని; నీవిట్లా దుఃఖిస్తూ ఉంటే నా కేమి ముచ్చట గనుక! పుట్టినింటిదగ్గరనే దిగులు లేకుండా ఉందువుగాని." ఈమాటలకు సీత మరింత దిగులంది చితికి పోతూ ఉన్న చిత్తమును చేరదీసుకుంటూ ఉండెను. తండ్రిని

చూడవలెనని కోరిక ఉన్నదిగాని, ఆయన వస్తే తన్ను పుట్టినింటికి తీసుకువెళ్లుతాడనిన్ని అదితనభర్తకే కాక తనకుకూడ దుస్సహమే అనిన్ని ఆచిన్నది తెలుసుకొన్నది. తల్లిదండ్రులనువిడిచి వచ్చుట ఎంతవిచారకరముగా ఉన్నదో, భర్తను విడిచి వెళ్లుట అంతకంటె హెచ్చుగా విచారకర మవునని ఆచిన్నదానికి అప్పుడు బాగా తెలిసివచ్చినది.

ఒకనాడు ఉదయము తొమ్మిదిగంటల వేళ సీత దొడ్లో ఏదో పని చేస్తూ ఉండగా అత్తగారు వచ్చి "పిల్లా! మీనాయనగారు వచ్చినారు. అల్లుడూ మామా సావట్లో ఏమో బిగ్గరగా మాటాడుకుంటున్నారు" అన్నది.

అదివిని సీత చీకాకుపడి తొందరగా దొడ్డిదోవను గదిలోనికి వచ్చి తలుపుచాటున నిలిచి వారిమాటలు వినెను. అప్పటి వారి మాట లివి:—

మామ:—ఎవడు చెప్పినాడోయి నీకు? వచ్చినపదిరోజులలోనే అటువంటి ఉత్తరము వ్రాయమని? అంతతొందరా? కష్టసుఖాలు ఆలోచించ అక్కరలేదా? కన్నమోహము, కడుపుతీపు, ఎట్టిదో నీకిప్పు డెట్లా తెలుస్తుంది? వచ్చి తీసుకువెళ్లవలసినదని కూడా ధిమాకా?

అల్లుడు:—అంతకంటె ఏమి చేయుటకూ నాకు తోచలేదు. నాదగ్గర ఉన్నదన్నసంతోషము నాకేమీ లేదాయెను. ఆహారము తినదాయెను. కన్నులనిండా నీరుతెచ్చుకొని దిక్కుచూపులు చూడడము, పలుకరిస్తే పలుకకపోవడము, చూచేటప్పటికి ఏమవుతుందో అని నాకు దిగులు తోచింది. ముచ్చటా అచ్చటా లేక చిక్కి చీకాకయి, చెడుతూ ఉంటే ఏమి చేసేది? ఆతర్వాత ఎందుకు తెలుపలేదని మీరేమన్నా అంటారేమో అని కూడా తోచింది. అక్కడ మీరు అంత ప్రేమతో పెంచుకొంటిరి. నాకెందుకు ఈ దుఃఖము? మీ రెవరయినా వచ్చి తీసుకువెళ్లుతారని అట్లా వ్రాసినాను.

మామ:—"పదిరోజులు అలవాటుపడితే బెంగతీరదూ! దాని కంత తీవ్రముగా వెంటనే రావలసినదని వ్రాయవలసినదేనా? ఇందుకోసమే కాబోలు నీవు కోరి తెచ్చుకొన్నది! సరే నాయనా! నీయిష్టప్రకారమే జరిగిస్తినిగదా! ఎట్లాగూ పిల్లనిచ్చుకొన్నతర్వాత వంగివంగి సలాములు చేయవలసినదే!" అంటూ అక్కడనుండి లేచి, కూతుర్ని చూచుటకు కాబోలు అయన లోపలికి వెళ్లెను. సీత గదితలుపుపై చిటికవేసి కదల్చెను. శ్రీరామమూర్తి గదిలోని కరిగెను. తెలికన్నులు తేలవేసి కన్నీరు నింపగా, పెదవులు అదరగా డగ్గుత్తికతో సీత మగనిచేతులు రెండూపట్టుకొని యిట్లు పలికెను.

సీత:—"నన్నా! నన్నేనా! పుట్టినింటికి పంపివేస్తారా? నేనుఏడుస్తున్నానని, వచ్చితీసుకువెళ్లవలసినదని, మానాన్నకు ఉత్తరము వ్రాసి పిలిపించినారా? నావల్ల మీకు ఆనందము కలుగడములేదా? అప్పటికీ మీకు వ్యాకులత కలుగుతుందని నేను ఎంతో బెంగదిగమింగు

కొని ఉంటూ ఉంటే"—పుటపుటకన్నీరు జారెను. పయిని పలుకజాలదయ్యెను.

శ్రీరామ:—"కలికీ! చిలుకమాట నేను చెప్పితే నీమాటఅనుకొని ఉలికి పడితివిగదే! నిన్ను పిలిపించుకొనేటందుకు చిలుకమీద మిషపెట్టి నేను వ్రాసినఉత్తరము మాటగదే మేము ముచ్చటించినది!" అని కన్నీరుతుడిచి చెక్కిలి పుడికెను అంత సీత ముఖము చిత్రముగా మారెను. వల్లభునిరొమ్ముమీంద వ్రాలెను.

గీ. పడనుడుల కుక్కఁ కడు దిగుల్పడినకల్కిఁ
దేర్చి యతఁ డట్టె చెయిచెక్కఁ దార్చి నట్టె
వింతకళ తోఁచె మొగముపై వేడ్కఁ పూచె
నెనరుఁ గన్నీరు రాలెఁ బన్నీరు వోలె.

అభిలాష

సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు

పర్వతములందుఁ దిరుగాడ వానిశిఖర
కోటివసియింప సెలయేళ్లఁ గ్రుంకులిడఁగఁ
గనఁగ నాయావిశేషముల్ మనసు పుట్టె
వారిదంబ! కొంపొమ్ము నీపైని నన్ను.

అలలపై నెక్కి తూఁగుటుయ్యాల లూఁగఁ
గడల వెలఁదుల గీతరాగములు వినఁగఁ
బాలజీవుల శయియింప బుద్ధి గలిగె
మారుతంబ! కొంపొమ్ము నమస్కరింతు.

ఆకసమునందుఁ బడి వలయములు దిరుగఁ
బల్లటీల్గొట్టుకొంచును బరుగు లెత్తఁ
గొమ్మలందునఁ గూర్చుండి కూయ బుద్ధి
గలదు కొనిపొండు నన్నుఁ బతంగంబులార!

తారకాబృంద మండలోద్యానమందు
నీమృగముతోడ నీతోడ నిత్యమాడు [దిరుగ
కొనుచు గంగలోఁ బడి యీఁదుకొనుచుఁ
మనసుగానుండెఁ గొనిపొమ్ము నను మృగాంక!

శయితదయితునిముద్దాడు ప్రియయువతినిఁ
దన్నుఁ దలఁచుచుఁ గూర్చుండియున్నతన్వి
వెనుకగా వచ్చి గిలిగించు ప్రియము నీగాంచ
నాశ గలదు కొంపొమ్మ యనంగ! నన్ను.